# ఓడిపోయాను!

పెళ్ళి అయి పదేళ్ళయినా నాకు పిల్లా పీచు లేరు. ఊరపిచ్చుక సత్తువ లేహ్యం తినమనీ... కంభంపాటి స్వయంప్రకాష్ డాక్టర్ని సంప్రదించమనీ అయినవారూ ఫ్రెండ్సూ అంతా అటలు పట్టిస్తుంటారు.

ఏ ఫంక్షన్కైనా వెడితే 'నీకు పిల్లలెందరు?' అని అంతా అడిగేవారే! ఆ మధ్య బంధువులింటికి పెళ్ళికెళ్ళాను.

అక్కడ ఓ ముసలావిడ తారసపడి "అదేమిట్రా పిచ్చి సన్యాసీ.. వద్దంటే డబ్బు సినిమాలోలాగ... కోరకుండానే పిల్లలు పుట్టుకొచ్చే వంశంరా మీది!... మీ తాతమ్మకి ఇరవై కాన్పులు. మీ బామ్మ పదిహేను పురుళ్ళు పోసుకుంది. ఇహ... మీ అమ్మ సంగతి సరేసరి- నీకు తెల్సుగా అడమగా అంతా కలిసి డజనుమంది! అవునా?... అలాంటిది నువ్వింతవరకూ తండ్రివి కాలేదంటే హాచ్చర్యంగానే వుంది మరి!... వట్టిపోయిన గొడ్డుకు మల్లే ఇంకా ఇలాగే వున్నావంటే... నాకు నమ్మశక్యంకాకుండా వుంది!..." నన్ను నాలుగూ దులిపేసింది.

పక్కనేవున్న నా శ్రీమతి ముఖం తోటకూర కాడలాగ వాడిపోయింది. నా ముఖానా నెత్తురు చుక్క కరువైంది.

"పిల్లల్లేకపోవటానికి కారణాలు సవాలక్ష వుంటయ్! ఏమే పిల్లా?... నీ మొగుడు నీతో సవ్యంగా కాపురం చేయటంలేదా ఏం? వేళకింత పెట్టి చీకటి పడగానే గుర్రు పెట్టమని దిచ్చుకొడుతున్నావా?- కాపురం అంటే అల్లాటప్పా కాదు. మొగుడిచేత మంచాలు విరగొట్టించాలి. అర్థమైందా..." మళ్ళీ ముసలావిడే అంది మా శ్రీమతి బుగ్గలు నొక్కుతూ.

ఇక అక్కడొక నిముషం కూడా మా ఇద్దరికీ నిలబడాలన్పించక... వెళ్ళిన వాళ్ళం భోజనమైనా చేయకుండా తిరిగి ఇంటికొచ్చేశాం!

వచ్చీరాగానే... నా మీద వంటికాలితో గయ్యమని లేచింది పేరిందేవి.

చూట్టానికి ఒంగోలు గిత్తలా వున్నావ్ ఏం లాభం? మన మొహానికి పిల్లా పీచా? శోభనం నాటి రాత్రినుంచి నెత్తీ నోరు మొత్తుకుంటున్నా... నా మాట విన్నారు కాదు. అప్పుడే ఏం తొందరని కొన్నాళ్ళు... పిల్లలు పుట్టుకొస్తే ఖర్చులు పెరుగుతయ్ అని మరికొన్నాళ్లూ... కుటుంబ నియంత్రణ అమలు చేయకపోతే ప్రభుత్వం బాధపడిపోతుందని... ఏదో వంకతో రోజులు గడిపారు. ఏళ్ళు గడిచినా నా కడుపు పండితేనా? అంతా నన్నాడిపోసుకునేవాళ్ళే... నే గొడ్డు మోతుదాన్నా?..." దండకం

మొదలుపెట్టి నన్ను ఊపిరి సలపనీయలేదు.

"నేను మాత్రం ఏం చేయను? మా నాన్న ఆయుర్వేద భిషక్ కావటంవల్ల అన్నిరకాల లేహ్యాలు నాచేత తినిపించాడు. గుళికలు మింగించాడు. ఫలితం సున్నా! అడ్డమైన మందులు తిని శరీరం ఊబకాయమౌతోంది! దిగులు పడకే పేరిందేవీ... ఇంకా బోలెడు వయసుంది మనకు... ఇప్పుడేం మించిపోయిందని నీ దిగులు?..." లాలించి నచ్చచెప్పి దగ్గరకు లాక్కో ప్రయత్నించాను.

"ఇందుకేం తక్కువలేదు..." దూరంగా జరిగి గుర్రుగ చూసింది నావేపు.

"మనిద్దరి మధ్యా నువ్వలా ఎడాన్ని పెంచావంటే మనకు పిల్లలు పుట్టరుగాక పుట్టరు. ఈ జన్మకి పుట్టరు! నువ్వు తల్లివి కాలేవు... నేను తండ్రినీ కాలేను. అండ్రస్టాండ్..." మిడతలాగ మీద వాలి గిలిగింతలు పెట్టాను. ముద్దుల్తో ముంచెత్తాను.

ఆఫీసుకి శలవు పెట్టి మీరు చేసే నిర్వాకం ఇదా?- అంటూ దూరంగా జరిగింది పేరిందేవి.

కష్టేఫలే అన్నారు కదా!? తీయంగ తీయంగ రాగం... మూల్గంగ మూల్గంగ రోగం... ప్రయత్నం చేయంగ చేయంగ పిల్లలూ అన్నారు కదా?- కొంటెగ శ్రీమతికేసి చూసాను.

ఛాల్లెండి! సిగ్గులేకపోతే సరి... కిర్రెక్కించేట్టు నవ్వింది.

★ ★ ★ ★ ★

ఆదివారం కావటాన విసుగు విరామం లేకుండా టీ.వీ కే అతుక్కునిపోయాను.

అరగంట ప్రోగ్రామ్‌కి ఇరవై నిముషాలు యాడ్స్ దంచేస్తున్నారు. ఇదీ టీవీ వారి దోపిడీ!!

చేతిలో రిమోట్‌తో ఛానళ్ళు మార్చినా ప్రతిచోటా ఇదే ఏడుపు.

కొత్తగా వస్తున్న ఓ తెలుగు ఛానల్లో మాత్రం మా అదృష్టంకొద్దీ 'పిల్లలు పుట్టటానికి కొంగొత్త చిట్కాలు' అనే అంశంమీద ప్రోగ్రాం నడుస్తోంది.

'ఏమేవ్... నువ్వోమాటు ఇలా రావాలి' వెర్రికేక పెట్టాను.

కళ్ళార్పకుండా... చెవులు రిక్కించాను!

ఎర్రని పిరుదుల మధ్య ఆచ్ఛాదనగా లంగోటీ... గుండెల మీద ఓ గుడ్డ పేలికతో వున్న ఇంగ్లీష్ ఆడాళ్ళను నోరూరించేటంతగా చూపిస్తున్నాడు. అసలు విషయం దాటవేసి మాయచేసి డబ్బు చేసుకున్నట్టన్పించింది.

వంటింట్లోంచి వస్తూ "ఏమిటా వెర్రివేషాలు... అలాంటి దిక్కుమాలిన సీన్లు చూడకపోతేనేం? ఇందుకా గావుకేక పెట్టి నన్ను పిల్చింది. నేనింకా ఏమిటో అనుకున్నాను"

గ(య్‌మంది పేరిందేవి.

"చూడూ! సారీ పేరిందేవీ... సెక్సు ఎడ్యుకేషన్ని ఇండియాలో కూడా ప్రవేశపెట్టాలనేది మన ప్రభుత్వ ఆశయాల్లో ఒకటి. కాబట్టి దృశ్యాలను చూడటం తప్పేమీ కాదు. గొట్టికాయలంత పిల్లలక్కూడా ఇకపై సెక్స్ పాఠాలు నేర్పించడం ఆరంభిస్తారట స్కూళ్లలో! నీకేమో ఎకసెక్కెంగా ఉంది. డోన్ట్ బి సిల్లీ! ఇండియన్ ఆడాళ్ళతో వచ్చిన చిక్కే ఇది. అంతా రహస్యం అనేడుస్తారు. అదే విదేశాల్లో అయితేనా... పగలే వెన్నెలా' అంటూ ఎంచక్కా సెమీ నగ్నంగా సముద్రపొడ్డున తారట్లాడుతూంటారు..." ఉపోద్ఘాతం లాంటిదిచ్చాను.

వాళ్ల సంగతి మనకు దేనికిగానీ... ముందు మన విషయం ఆలోచించండి! నిన్న మీ మామయ్య వచ్చి మిమ్మల్ని డాక్టర్ని సంప్రదించమని చెప్పలేదూ?- ఆ విషయం ఏం చేసారూ?- దీర్ఘాలు తీసింది.

"అదా... అదీ... అదంతా శుద్ధ దండుగ! ఆ టెస్టనీ ఈ టెస్టనీ వేలకు వేలు ఖర్చు పెట్టించటం మినహా ఉపయోగం ఉండదే పిచ్చి మొహమా!- చివరికి జబ్బేం లేదంటారు. మనకు నాలుగైదువేలు జిడ్డు వదుల్తుంది అంతే!!"

"అంత తేలికగ కొట్టి పారేయకండీ! మా బంధువుల అవిడ ఆమధ్య పిల్లల్లేకపోతే వైద్య పరీక్షలు చేయించుకుని రెండునెలలు ఇంజక్షన్లూ... గొట్టాలు మింగితే మూడోనెల్లో నీళ్ళోసుకుందట!..." అరిందలా కళ్ళు తిప్పుతూ మాట్లాడింది.

"అంతగా నీళ్ళోసుకోవాలని దుర్ధగా ఉంటే నువ్వెళ్ళు. వెళ్ళి చెకప్ చేయించుకో! మీ పుట్టింటారిని డబ్బు పంపమని లెటర్ వ్రాయి. అప్పటికి గానీ నీ దురగ తీరదు. తల్లివి కావాలనుకుంటే తిప్పలు తప్పవు మరి..."

"అయితే ఓ పన్చేద్దాం! ఇద్దరం పరీక్ష చేయించుకుందాం! ఏం? సరేనా?!-" గోముగ అడిగింది.

"నాకు తెల్సు! నాలో ఏ లోపమూలేదు. ఈ విషయం నీకూ తెల్సు! అవునా?... అలాంటప్పుడు నేను దేనికి?"

"చివరిసారిగ అడుగుతున్నాను. నా మాట వింటారా లేదా?- వినకపోయారంటే ఎండగడతాను... ఖబడ్దార్?-"

పెళ్ళామిచ్చిన అల్టిమేటమ్‌కి బిత్తరపోయి "పెళ్ళాం చెబితే వినాలి..." అంటూ సినిమాపాట ఆలపించాను.

గ్రీన్‌సిగ్నలిచ్చినందుకు ఆ రాత్రి శోభనం రాత్రే అయింది.

★ ★ ★ ★ ★

ఉదయాన్నే కాఫీ సేవిస్తూ... న్యూస్‌పేపర్ చదివేస్తూ 'నాకో అయిడియా వచ్చింది పేరిందేవీ...' కిచెన్ వేపు తలతిప్పి స్వరం పెంచాను.

'మళ్ళీ ఏదైనా మార్పా?-" వంటింట్లోనించే అడిగింది.

"లిటిల్‌ఛేంజ్!- మనిద్దరి జాతకాలూ తీసుకుని పేరిశాస్త్రిగారి దగ్గర కెళ్దాం. మనకసలు సంతానయోగం వుందో లేదో చెప్పమంటాను. ఏమంటావ్?-"

"మనకి పిల్లలే పుట్టరనడానికి ఆయనేమైనా డాక్టరా?- నాకు అలాంటి వాటిమీద నమ్మకంలేదు..."

"అంటే శాస్త్రం వఠి బూటకమంటావా?-"

"జ్యోతిష్‌శాస్త్రం... వాస్తుశాస్త్రంమీద తర్జన భర్జనలు జరుగుతున్నరోజులివి! పేపర్లో చదవటం లేదా?... టి.వీ.లో చూడటంలేదా?-"

వామ్మో! దీనికి గొప్ప పరిజ్ఞానమే వుంది... మనసులో గొణుక్కుని "మనం వాదించుకోవటం దేనికి?- ముందు నన్ను సిద్ధాంతిగారి దగ్గరికి వెళ్ళిరానీ... ఆయన చెప్పే దాంతో నిమిత్తం లేకుండా మంచిరోజు చూచుకుని డాక్టర్‌వద్దకూ వెళ్ళొద్దాం! సరేనా?-" నా చివరి నిర్ణయం చెప్పాను.

లేడికి లేచిందే పరుగన్నట్టు... లేచివెళ్ళి బీరువాలో జాతకాల పుస్తకం అందుకుని... డ్రెస్ మార్చుకుని వీధిలోకి నడిచాను.

అన్ని కోణాల్లోనుంచి మా ఇరువురి జాతకాలు పరిశీలించి పెదవి విరిచారు.

హతవిధీ అనుకున్నాను!

కొన్ని జాతకాలంతే మరి!... పోనీ ఎవరినైనా దత్తత తీసుకోండి... అన్న పేరిశాస్త్రిగారి సలహాకి నా ఒళ్లు మండిపోయింది.

కాళ్ళీడ్చుకుంటూ కొంప చేరుకున్నాను.

"దివాలా తీసినవాడిలా ఆ మొహమేమిటి?..." వాకిట్లోనే ఎదురై పేరిందేవి ప్రశ్నించింది.

"సమ్మర్‌కదా... ఎర్రని ఎండలో నడుచుకుంటూ వచ్చాను... దిమ్మ తిరిగినట్టయింది! అంతే..."

"ఉండండి... చల్లటి మంచినీళ్ళు తెస్తాను" ఫ్రిడ్జ్‌లోంచి వాటర్ బాటిల్ తీసి గ్లాసులోకి వొంపి తెచ్చి నాకు అందించింది.

"ఏమన్నారేమిటి సిద్ధాంతి?-" చల్లగా అడిగింది.

"నాముఖం చూస్తే తెలీటంలేదా?-" ఎదురుప్రశ్న వేసాను.

"నేనప్పుడే చెప్పాను... వెళ్లకండీ అని! నా మాట వింటే కదా?... ఆయన గారికి ఇచ్చిన తాంబూలం ఖర్చొకటి దండగ మనకు? దొడ్లోకెళ్ళి కాళ్ళు కడుక్కురండి. భోజనం వడ్డిస్తాను..." విసవిసా ఇంట్లోకి నడిచింది.

★ ★ ★ ★ ★

ఆటోలో ఇద్దరం ఇమేజ్ హాస్పిటల్ చేరుకున్నాం. కన్సల్టేషన్ ఫీజు చెల్లించి నేను మగ డాక్టర్ వద్దకి పేరిందేవి లేడీ గైనకాలజిస్ట్ దగ్గరకూ వెళ్ళి క్యూలో వుండిపోయాం.

అసలు పాయింట్ చెప్పకుండా డొంకతిరుగుడుగా డాక్టర్ నన్ను ప్రశ్నించటం... నాలో గుండె వేగాన్ని పెంచినట్టయింది.

"బీ కూల్! మీ మిసెస్‌తో అన్ని విషయాలు వివరంగా చెప్పాను. దట్సాల్!- మీరిక వెళ్ళొచ్చు..." గెంటినట్టు మాట్లాడింది.

ఇద్దరం బైటికి నడిచి ఆటో ఎక్కాం! ఇద్దరిలోనూ మౌనం.

ఇంటికి వచ్చేదాకా ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.

తలుపు తెరిచి స్పీడుగా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి బెడ్‌మీద వాలిపోయింది పేరిందేవి.

పేరిందేవి చర్యకు ఆశ్చర్యపోయాను.

"ఇంతకీ డాక్టరేం చెప్పింది..." వీపు మీద నిమురుతూ అడిగాను.

"నేను తల్లినయ్యే యోగం ఈ జన్మకు లేదన్నది..." బావురుమంది.

పేరిందేవిలో దుఃఖం కట్టలు తెంచుకుంది. ఓదార్చటం నా తరం కాలేదు.

"కంట్రోల్ యువర్ సెల్ఫ్! ప్లీజ్... విషయం చెప్పు?-" సముదాయించాను.

"వయస్సుతోపాటు గర్భసంచి పెరగలేదట. అందుకే మనకు పిల్లలు కలగలేదంది! దీనికి వైద్యం లేదన్నది..." కుళ్లి కుళ్లి పదేపదే చెప్తూ ఏడ్చింది.

నాకు మతిపోయినట్టయింది.

"ఓడిపోయానండీ!... నేనే ఓడిపోయాను..." పేరిందేవి కంఠం జీరవోయింది.

ఓదార్చే ప్రయత్నంలో బాహువుల్లో ఇముడ్చుకున్నాను.

ఈ విషయంలో గెలుపు ఓటమీ అంటూ ఏమీ ఉండదు పేరిందేవీ! శాస్త్రం చెప్పినా... మెడికల్ సైన్స్ చెప్పినా ఒక్కటే! తేడా ఉండదు. టేకిట్ ఈజీ... నువ్వు నాకు... నాకు నువ్వు పిల్లలం!... ఈ జన్మ కింతే!!-"

పేరిందేవి చెక్కిళ్ళమీది చారికలు తుడిచి ఓదార్చే ప్రయత్నం చేసాను

- సమాప్తం -